సాక్షి విశాఖపట్నం

శుక్రవారం । 26 । జూలై । 2024



'నవోదయ' పిలుస్తోంది

కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా ఆంగ్ల మాధ్యమ విద్యనందిస్తున్న ప్రభుత్వ రంగ విద్యా సంస్థ జవహర్ నవోదయ విద్యాలయం. 8లో



కార్గిల్ అమరులకు ఘన నివాళి

విజయ దివస్ పురస్కరించుకుని బీజేపీ యువ మోర్చా నాయకులు కార్గిల్ యుద్ధ వీరులకు ఘన నివాళులర్పించారు. 8లో



కోణార్క్‌కు జనరల్ కోచ్‌లు


కోణార్క్ ఎక్స్‌ప్రెస్‌కు మరో రెండు జనరల్ కోచ్‌లను జత చేయనున్నట్లు వాల్తేర్ డివిజన్ సీనియర్ డీసీఎం కె.సందీప్ తెలిపారు. 8లో

న్యూస్‌రీల్

19 మంది తహసీల్దార్ల రిలీవ్

మహారాణిపేట: సొంత జిల్లాలకు తహసీల్దార్లు వెళ్లేందుకు మార్గం సుగమం అయింది. వర్షాలు తగ్గుముఖం పట్టడం, జిల్లాలో పనిచేస్తున్న తహసీల్దార్లు నుంచి ఒత్తిడి రావడం, తదితర కారణాలతో వారిని రిలీవ్ చేయడానికి గురువారం సాయంత్రం కలెక్టర్ ఎం.ఎన్. హరేందిర ప్రసాద్ గ్రీన్‌సిగ్నల్ ఇచ్చారు. జిల్లాలో వివిధ మండలాలు, వివిధ కేడర్‌ల్లో పని చేస్తున్న 19 మంది తహసీల్దార్లను రిలీవ్ చేస్తూ కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు. 9 మందిని విజయనగరం, 9 మందిని పార్వతీపురం మన్యం, ఒకరిని శ్రీకాకుళం జిల్లాకు రిలీవ్ చేశారు. తహసీల్దార్లు సొంత జిల్లాలకు వెళ్లేందుకు ఈ నెల 19నే ప్రభుత్వం అనుమతించినప్పటికీ.. వర్షాల కారణంగా ఆలస్యమైంది.

రైతుబజార్లలో టమాటా కిలో రూ.38



మహారాణిపేట: జిల్లాలోని అన్ని రైతుబజార్లలో శుక్రవారం నుంచి టమాటా కిలో రూ.38కి విక్రయిస్తున్నట్లు జాయింట్ కలెక్టర్ కె.మయూర్ అశోక్ ఓ ప్రకటనలో తెలిపారు. చిత్తూరు జిల్లా నుంచి టమాటాలు దిగుమతి చేసుకుని.. మార్కెట్‌లో ధర కన్నా తక్కువకు విక్రయిస్తున్నట్లు పేర్కొన్నారు. ధరలు అందుబాటులోకి వచ్చే వరకు విక్రయాలు కొనసాగుతాయని వివరించారు.

స్కూల్ బస్సుపై కేసు, ఆటో సీజ్



ఆటోలను తనిఖీ చేస్తున్న అధికారులు

గోపాలపట్నం: రవాణా శాఖ అధికారులు గురువారం నగరంలో చేపట్టిన తనిఖీల్లో నిబంధనలకు విరుద్ధంగా నడుపుతున్న ఓ స్కూల్‌పై కేసు నమోదు చేశారు. ఓ ఆటోను సీజ్ చేశారు. ఇప్పటివరకు జరిగిన ప్రత్యేక తనిఖీల్లో 51 బస్సులపై కేసులు నమోదు చేయగా.. ఐదు బస్సులను సీజ్ చేశారు. అలాగే 25 ఆటోలపై కేసులు నమోదు చేసి, ఐదు ఆటోలను సీజ్ చేసినట్లు ఉప రవాణా కమిషనర్ రాజారత్నం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ తనిఖీల్లో ఎంవీఐలు బి.రాజారావు, ఐ.మాధవి, సిబ్బంది పాల్గొన్నారు.

బాలల పురస్కారానికి దరఖాస్తు గడువు పొడిగింపు

విశాఖ విద్య: జాతీయ బాలల పురస్కారానికి దరఖాస్తు గడువును పొడిగించినట్లు రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యుడు డాక్టర్ జి.సీతారాం తెలిపారు. సామాజిక సేవ, సాంకేతిక పరిజ్ఞానం, పర్యావరణం, క్రీడలు, కళలు, సాహిత్యం, సంగీతం, నృత్యం, పెయింటింగ్, నూతన ఆవిష్కరణలు ఇలా ఏ రంగంలో అయినా ప్రావీణ్యాన్ని చాటుకుంటున్న 5–18 ఏళ్ల వయసు గల వారు బాలల అవార్డు దక్కించుకోవచ్చన్నారు. తగిన ధ్రువీకరణ పత్రాలతో https://awards.gov.in/ అనే వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఆసక్తి, అర్హత గల బాలల ఆగస్టు 31లోగా దరఖాస్తు చేసుకోవాలని, దీనిపై పాఠశాలల స్థాయిలో విస్తృతంగా ప్రచారం నిర్వహించాలని విద్యాశాఖాధికారులకు సూచించారు.

రేపు జెడ్పీ సర్వ సభ్య సమావేశం

మహారాణిపేట: జిల్లా పరిషత్ సర్వ సభ్య సమావేశం ఈ నెల 27న ఉదయం 10.30 గంటలకు చైర్‌పర్సన్ జె.సుభద్ర అధ్యక్షతన జరగనుంది. జెడ్పీ సమావేశ మందిరంలో జరిగే ఈ సమావేశానికి సభ్యులు, ఆహ్వానితులు హాజరు కావాలని సీఈవో ఎం.పోలినాయుడు కోరారు. అన్ని శాఖల అధికారులు పూర్తి సమాచారంతో సిద్ధం కావాలన్నారు.

డొంకరాయికి వరద తాకిడి

- రూ.2,200 క్యూసెక్కుల విడుదల



డొంకరాయి జలాశయం నుంచి విడుదల అవుతున్న వరదనీరు

మోతుగూడెం : జల విద్యుత్ కేంద్రాలకు నీరందించే లోయర్ సీలేరు డొంకరాయి జలాశయానికి వరద తాకిడి కొనసాగుతోంది. పూర్తిస్థాయి నీటి మట్టానికి చేరుకోవడంతో బుధవారం అర్ధరాత్రి ఒక గేటు ద్వారా రెండు అడుగులు ఎత్తి 2,200 క్యూసెక్కుల నీటిని జెన్‌కో అధికారులు దిగువకు విడుదల చేశారు. లోతట్టు ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వారు సూచించారు.

మాంగనీస్ హ్యాండ్లింగ్‌లో పోర్టు రికార్డ్



పోర్టులో ఎంవీ హువాయిన్ కార్గో షిప్

- దేశంలోనే తొలిసారిగా 1,99,900 మెట్రిక్ టన్నుల మాంగనీస్ హ్యాండ్లింగ్
- 300 మీటర్ల పొడవైన ఎంవీ హువాయిన్ కార్గో షిప్‌లో చేరుకున్న వైనం

సాక్షి, విశాఖపట్నం: భారీ స్థాయిలో మాంగనీస్ లోడ్‌తో ఎంవీ హువాయిన్ న్యూ కాసిల్ మార్క్స్‌లైన్ కార్గో షిప్ గురువారం విశాఖపట్నం పోర్టుకు చేరుకుంది. ఈ భారీ నౌకను జనరల్ కార్గో బెర్త్‌లో పోర్టు అధికారులు బెర్తింగ్ చేశారు. ఈనెల 7న గాబన్ నుంచి 1,99,900 మెట్రిక్ టన్నుల మాంగనీస్‌తో బయల్దేరి 18 రోజుల తర్వాత విశాఖ చేరుకుంది. భారతీయ పోర్టుకు సింగిల్ నౌక ద్వారా తీసుకువచ్చిన అతి పెద్ద సరుకు ఇదే కావడం విశేషం. ఇందులో 1,24,500 మెట్రిక్ టన్నులను విశాఖపట్నం పోర్టులో అన్‌లోడ్ చేశారు. ఈ నౌక 300 మీటర్ల పొడవు, 50 మీటర్ల వెడల్పు, 18.46 మీటర్ల డ్రాఫ్ట్ కలిగి ఉందని పోర్టు చైర్మన్ డా.అంగముత్తు తెలిపారు. ఈ సరుకును ప్రపంచంలోనే మాంగనీస్ ఎగుమతికి పేరు పొందిన ప్రముఖ మాంగనీస్ ఎగుమతిదారుడు ఎరామెట్ ఎస్.ఎ. ఫ్రాన్స్ రవాణా చేశారు. బోత్రా షిప్పింగ్ సర్వీసెస్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ.. షిప్, సరుకు నిర్వహణ ఏజెంట్‌గా సేవలు అందిస్తోంది. ఈ షిప్‌మెంట్ విశాఖపట్నం పోర్టు, బోత్రా షిప్పింగ్ సర్వీసెస్‌కు ఒక ముఖ్యమైన మైలురాయిగా నిలిచిపోతుందని చైర్మన్ డా.అంగముత్తు పేర్కొన్నారు. భవిష్యత్తులో విశాఖపట్నం పోర్టు బల్క్ కార్గో ట్రాన్షిప్‌మెంట్‌కు కేంద్రంగా మార్చడానికి కృతనిశ్చయంతో ఉన్నామని ఆయన స్పష్టం చేశారు.

డంపింగ్ యార్డు మూసేయకపోతే సత్యాగ్రహం

- వాటర్ మేన్ ఆఫ్ ఇండియా రాజేంద్ర సింగ్



మాట్లాడుతున్న రాజేంద్రసింగ్, బొలిశెట్టి

ఆరిలోవ: పేద ప్రజల ఆరోగ్యాన్ని బలి తీసుకుంటున్న ముడసర్లోవ డంపింగ్ యార్డును వెంటనే మూసివేయాలని వాటర్ మేన్ ఆఫ్ ఇండియా రాజేంద్రసింగ్ డిమాండ్ చేశారు. ప్రభుత్వం స్పందించకపోతే సత్యాగ్రహం చేపడతానని హెచ్చరించారు. పలువురు సామాజిక కార్యకర్తలతో కలిసి గురువారం ఆయన ముడసర్లోవ ప్రాంతాన్ని సందర్శించారు. డంపింగ్ యార్డు, నిర్మాణంలో ఉన్న హార్స్ క్లబ్, ముడసర్లోవ రిజర్వాయర్, దాని వెనుక ఉన్న నిర్మానుష్య ప్రాంతాన్ని పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ ముడసర్లోవ ప్రాంతంలో జీవీఎంసీ డంపింగ్ యార్డు ఏర్పాటు చేయడం సహజ వాతావరణానికి గండి కొట్టినట్లేనన్నారు. డంపింగ్ యార్డు వ్యర్థాలు వర్షాలు కురుస్తున్నప్పుడు వరద నీటితో పాటు ముడసర్లోవ రిజర్వాయరులో కలుస్తున్నాయని చెప్పారు. సామాజిక కార్యకర్తలు బొలిశెట్టి సత్యనారాయణ, జె.వి.రత్నం, జియాలజిస్ట్ రాజశేఖరరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

● విజయీభవ

సాగరతీరంలో జాతీయ జెండాలతో క్రీడాభిమానులు



విశాఖ స్పోర్ట్స్: పారిస్‌లో శుక్రవారం నుంచి ప్రారంభం కానున్న విశ్వ క్రీడావేదికపై భారత జాతీయ పతాకం రెపరెపలాడాలని విశాఖ క్రీడాభిమానులు ఆకాంక్షించారు. ఈ సారి ఒలింపిక్స్ పోటీలకు దేశం నుంచి 117 మంది క్రీడాకారులు పాల్గొంటుండగా.. తెలుగు రాష్ట్రాల నుంచి ఏడుగురు తమ ప్రతిభ చూపేందుకు సిద్ధమయ్యారు. వీరిలో విశాఖకు చెందిన జ్యోతి యర్రాజి వుమెన్ వంద మీటర్ల హర్డిల్స్‌లో, బ్యాడ్మింటన్‌లో పీవీ సింధు, బాక్సింగ్‌లో నిఖత్ జరీన్ సింగిల్స్‌లో సత్తా చాటేందుకు బరిలో దిగుతున్నారు. సాత్విక్ రాజ్ మెన్ డబుల్స్‌లో, ధీరజ్ మెన్ రికర్వ్ ఆర్చరీలో, టీటీలో ఆకుల శ్రీజతో పాటు జ్యోతిక శ్రీ వుమెన్ నాలుగువందల మీటర్ల రిలేలో జట్టుగా పోటీపడుతున్నారు. విశాఖ క్రీడాభిమానులు గురువారం సాగరతీరంలో జాతీయ జెండాలు ప్రదర్శించి.. క్రీడాకారులందరికీ శుభాకాంక్షలు తెలిపారు. విజయం సాధించి తిరిగి రావాలని ఆకాంక్షించారు.

నిస్తార్‌కి ఏమైంది?

భారత నేవీని బిల్డర్స్ నేవీగా మార్చేలా ప్రతిష్టాత్మకంగా నిర్మించిన డైవింగ్ సపోర్ట్ వెసల్(డీఎస్వీ) నిస్తార్ యుద్ధ నౌక నిర్మాణంలో లోపాలు తలెత్తాయా..? ఎంఎస్ఎంఈల సహకారంతో నిర్మించిన ఈ కీలక నౌకలో నాసిరకం పరికరాలు వినియోగించారా..? అవుననే అంటున్నాయి ప్రస్తుత పరిణామాలు. దేశానికి ప్రధానాస్త్రంగా మారుతుందనుకున్న నిస్తార్ యుద్ధ నౌక సీ ట్రయల్స్‌లో బయటపడ్డ లోపాలు.. హిందూస్థాన్ షిప్‌యార్డులోనే కాదు.. నౌకాదళంలోనూ ఆందోళన కలిగిస్తున్నాయి.! అసలు తప్పెక్కడ జరిగిందనే అంశంపై షిప్‌యార్డు పోస్టుమార్టం ప్రారంభించింది. ఈ వ్యవహారాన్ని గోప్యంగా పరిష్కరించేందుకు హెచ్ఎస్ఎల్ అధికారులు విశ్వ ప్రయత్నాలు చేస్తున్నారు.

–సాక్షి, విశాఖపట్నం



సీ ట్రయల్స్‌కు వెళ్తున్న నిస్తార్ (ఫైల్)

- డీఎస్వీ నిస్తార్ సీ ట్రయల్స్‌లో బయటపడ్డ నిర్మాణ లోపాలు
- ఈ నెల 15న ట్రయల్స్ కోసం బయల్దేరిన యుద్ధనౌక
- అర్ధాంతరంగా 19నే షిప్‌యార్డ్‌కు తిరిగొచ్చేసిన వైనం
- ఇంజిన్ మరమ్మతుల కోసం రష్యా నుంచి నిపుణుల బృందం
- ఎంఎస్ఎంఈలకు కీలక బాధ్యతల అప్పగింతలో అవకతవకలు
- గోప్యంగా ఉంచుతున్న షిప్‌యార్డ్ అధికారులు

భారత నౌకాదళం కోసం విశాఖలోని హిందూస్థాన్ షిప్‌యార్డు(హెచ్ఎస్ఎల్)లో నిస్తార్ క్లాస్‌తో రెండు డైవింగ్ సపోర్టు వెసల్స్ నిర్మించేందుకు రక్షణ మంత్రిత్వ శాఖ 2018లో కీలక ఒప్పందం కుదుర్చుకుంది. డీఎస్వీ నిస్తార్, డీఎస్వీ నిపుణ్ నౌకలను తయారు చేసేందుకు రూ.2392.94 కోట్లను కేటాయించింది. మూడేళ్లలో తొలి నౌకను అందించాలని ఒప్పందంలో స్పష్టం చేసింది. అయితే కోవిడ్ కారణంగా పనులు ఆలస్యమై 2023 జూలైలో డీఎస్వీ నిస్తార్, డీఎస్వీ నిపుణ్‌ను డెలివరీ చేశారు. 80 శాతం ఆత్మ నిర్భర్ భారత్ లక్ష్యంతో దీన్ని స్వదేశీ పరిజ్ఞానంతో రూపొందించారు. 120కిపైగా ఎంఎస్ఎంఈల సహకారంతో నిస్తార్, నిపుణ్ యుద్ధ నౌకలను పూర్తి చేసి గతేడాది ప్రారంభించారు. అనంతరం హార్బర్ ట్రయల్స్ నిర్వహించారు. తాజాగా సీ ట్రయల్స్ నిర్వహిస్తున్న సమయంలో నిస్తార్‌లో నిర్మాణ లోపాలు బట్టబయలయ్యాయి.

గుట్టుగా పని పూర్తి చేసేద్దాం!

ప్రతిష్టాత్మకంగా చేపట్టిన షిప్ ఇంజిన్‌లో లోపాలు తలెత్తడంతో హెచ్ఎస్ఎల్ ఉన్నతాధికారులు ఆందోళన వ్యక్తం చేశారు. ఈ వ్యవహారంపై తర్జన భర్జన పడుతూ ఏం చేయాలన్నదానిపై అత్యవసర సమావేశం నిర్వహించినట్లు తెలిసింది. షిప్ ఇంజిన్‌లో సమస్య తలెత్తిందన్న విషయాన్ని నౌకలో ఉన్న సిబ్బంది తెలియజేయగానే.. అత్యవసరంగా రష్యా నుంచి నిపుణులను తీసుకొచ్చారు. వారిని నౌక వద్దకు పంపించి.. సరిచేసేందుకు యత్నించినా విఫలమైంది. దీంతో నిస్తార్‌ను తిరిగి షిప్‌యార్డుకి తీసుకొచ్చేశారు. రష్యా నుంచి వచ్చిన ఇంజినీర్ల సహకారంతో యుద్ధ ప్రాతిపదికన మరమ్మతు పనులు నిర్వహిస్తున్నారు. మరోవైపు నిస్తార్‌లో బట్టబయలైన లోపాలపై విచారణ మొదలు పెట్టినట్లు సమాచారం. నిర్మాణంలో పాలుపంచుకున్న ఎంఎస్ఎంఈల్లో ఓ సంస్థ అందించిన పరికరాలు నాసిరకమైనవిగా ఉండటం వల్లే ఇంజిన్‌లో సమస్య వచ్చిందని షిప్‌యార్డు కార్మికులు కొందరు చెబుతున్నారు. అయితే ఆ సంస్థపై ఎలాంటి చర్యలు తీసుకోవాలి.? తమపై మరోసారి ఈ మచ్చ పడకుండా.. పనులను వేగవంతంగా ఎలా పూర్తి చేయాలనే దానిపై మల్లగుల్లాలు పడుతున్నట్లు సమాచారం. నిస్తార్‌లో తలెత్తిన లోపాల విషయంలో బాధ్యులపై ఎలాంటి చర్యలు తీసుకుంటారోనన్న అంశం ఇప్పుడు షిప్‌యార్డులో చర్చనీయాంశమైంది.

ఐదు రోజులకే వెనక్కి..

ముందుగా పలుమార్లు తక్కువ దూరం వ్యవధిలో నిస్తార్ సీ ట్రయల్స్ విజయవంతంగా నిర్వహించారు. సుదీర్ఘ సీ ట్రయల్స్ కోసం షిప్ యార్డు నుంచి డీఎస్వీ నిస్తార్ ఈ నెల 15న బయలుదేరింది. సముద్ర జలాల్లో కలియతిరిగి.. అన్ని విభాగాలూ పూర్తిస్థాయిలో పరీక్షించిన అనంతరం.. 22వ తేదీ రాత్రికి షిప్‌యార్డుకు చేరుకోవాల్సి ఉంది. కానీ షిప్‌యార్డు అధికారులు, కార్మికులు, ఉద్యోగులు, షిప్ డిజైన్ సంస్థల ప్రతినిధులతో బయలుదేరిన షిప్‌లో సాంకేతిక లోపాలు తలెత్తాయి. ఇంజిన్‌లో లోపాలు బయటపడటంతో పూర్తిస్థాయిలో సీ ట్రయల్ నిర్వహించడం కష్టమని భావించిన టెక్నికల్ సిబ్బంది.. షిప్‌ని అర్ధాంతరంగా వెనక్కి తిప్పారు. 19వ తేదీ రాత్రికి షిప్‌యార్డుకు నిస్తార్ చేరుకుంది. 8 రోజుల పాటు సాగాల్సిన సీ ట్రయల్స్.. ఐదు రోజులకే అర్ధాంతరంగా ముగిశాయి.

యూ డైస్ ప్లస్ నమోదుపై దృష్టి సారించాలి

- ఆర్ఐవో మురళీధర్



మాట్లాడుతున్న ఆర్ఐవో మురళీధర్

విశాఖ విద్య: ఉమ్మడి విశాఖ జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు కాలేజీల్లో చదువుతున్న విద్యార్థుల సమగ్ర వివరాలను యూ డైస్ ప్లస్ పోర్టల్‌లో నమోదు చేయాలని ఆర్ఐవో పి.మురళీధర్ సూచించారు. ఇంటర్మీడియెట్ కాలేజీలకు సంబంధించి జిల్లాలోని పలు మేనేజ్‌మెంట్ల నిర్వాహకులతో ఆర్ఐవో కార్యాలయంలో గురువారం సమావేశం నిర్వహించారు. ఇంటర్మీడియెట్ బోర్డు కమిషనర్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా కాలేజీల మేనేజ్‌మెంట్లకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆర్ఐవో మురళీధర్ మాట్లాడుతూ ఇంటర్ చదువుతున్న ప్రతీ విద్యార్థికి సంబంధించిన వివరాల నమోదును ఈ నెలాఖరు నాటికి పూర్తి చేయాలని ఆదేశించారు. భవిష్యత్తులో విద్యార్థులకు సంబంధించిన ఏ సమాచారం కావాలన్నా, నేరుగా యూ డైస్ ప్లస్ పోర్టల్ ద్వారానే సేకరిస్తామని తెలిపారు. వార్షిక పరీక్షలకు నామినల్ రోల్స్ జారీ కూడా దీన్ని ఆధారంగా చేసుకునే ఉంటుందన్నారు. కాలేజీల నిర్వాహకులు ప్రత్యేక శ్రద్ధ తీసుకొని, సకాలంలో వివరాలను నమోదు చేయాలని సూచించారు. ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో చదువుకునే విద్యార్థులకు నోట్స్ బుక్స్ వచ్చాయని, త్వరలోనే టెక్స్ట్ బుక్స్ కూడా పంపిణీ చేస్తామని జిల్లా వృత్తి విద్యాశాఖాధికారి బి.రాధ తెలిపారు. సమావేశంలో కాలేజీల నిర్వాహకులు పాల్గొన్నారు.

సహకార సంఘాల బలోపేతంపై దృష్టి

- ప్రతీ మండలంలో పెట్రోల్ బంకుల నిర్వహణ
- డీసీసీబీ పర్సన్ ఇన్‌చార్జి, జేసీ మయూర్ అశోక్



మాట్లాడుతున్న జేసీ మయూర్ అశోక్, మహాజన సభకు హాజరైన అధికారులు

విశాఖ విద్య : సహకార సంఘాల బలోపేతంపై ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా కేంద్ర సహకార బ్యాంకు పర్సన్ ఇన్‌చార్జి, జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్ అన్నారు. డీసీసీబీ మహాజన సభ గురువారం మద్రిపాలెంలో గల బ్యాంకు ప్రధాన కార్యాలయంలో నిర్వహించారు. ఉమ్మడి విశాఖ జిల్లాలోని డీసీసీబీ కార్యకలాపాలపై సుదీర్ఘంగా చర్చించారు. 2023–24 ఆర్థిక సంవత్సరానికి రూ.1.6 కోట్ల నికర లాభం ఆర్జించినట్లు బ్యాంకు సీఈవో డి.వి.ఎస్.వర్మ మహాజన సభ దృష్టికి తీసుకొచ్చారు.

ఈ సందర్భంగా బ్యాంకు పర్సన్ ఇన్‌చార్జి, జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్ మాట్లాడుతూ ప్రాథమిక వ్యవసాయ సంఘాలు ఆర్థికంగా అభివృద్ధి చెందటం ద్వారానే వాటిని బలోపేతం చేయటం సాధ్యమవుతుందన్నారు. బ్యాంకులు, సహకార సంఘాల బాధ్యులు ఇందుకు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. డీసీసీబీకి అనుబంధంగా ఉన్న బ్యాంకులు ఆర్థిక కార్యకలాపాలను విస్తృతం చేయాలన్నారు. సహకార సంఘాల ద్వారా ప్రతీ మండలంలో పెట్రోల్ బంకుల నిర్వహణపై దృష్టి పెట్టాలన్నారు. ఆర్థికాభివృద్ధిలో భాగంగా ఎరువుల విక్రయశాలలు, జన ఔషధ కేంద్రాలు, ఎం.పి.ఎఫ్.సీ గోదాములు ఏర్పాటు చేయాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందన్నారు. ఇందుకు అవసరమైన ప్రణాళికలను సిద్ధం చేయాలన్నారు. మారుతున్న కాలానికి అనుగుణంగా టెక్నాలజీ అందిపుచ్చుకోవాలన్నారు. బ్యాంకుల కంప్యూటరీకరణ సాధ్యమైనంత తొందరగా పూర్తి చేయాలన్నారు. కంప్యూటరీకరణతో సేవలు మరింత సులభతరం అవుతాయని, అదేవిధంగా డీసీసీబీ కార్యకలాపాలు మరింత పారదర్శకత ఉంటుందన్నారు. బ్యాంకుల పరిధిలో అవసరాలకు అనుగుణంగా వ్యాపార కార్యకలాపాలను నిర్వహించటం ద్వారా ఆర్థికాభివృద్ధి వైపు అడుగులు వేయాలన్నారు.

సమావేశంలో బ్యాంకు సీఈవో డి.వి.ఎస్. వర్మ, అనకాపల్లి జిల్లా సహకార శాఖ అధికారి ప్రేమ స్వరూపరాణి, విశాఖ, అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు జిల్లాల పరిధిలోని బ్యాంకు పర్సన్ ఇన్‌చార్జిలు పాల్గొన్నారు.

కమిషనర్ సిటీ ఆపరేషన్ సెంటర్ సందర్శన



సీసీ కెమెరాలు, స్మార్ట్ పోల్స్‌ను స్క్రీన్‌పై వీక్షిస్తున్న కమిషనర్ సంపత్‌కుమార్

డాబాగార్డెన్స్: జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలోని సిటీ ఆపరేషన్ సెంటర్‌ను జీవీఎంసీ కమిషనర్ సంపత్‌కుమార్ గురువారం సందర్శించారు. ఇక్కడి సేవలపై పర్యవేక్షక ఇంజినీర్ వినయ్‌కుమార్‌ను అడిగి తెలుసుకున్నారు. సిటీ ఆపరేషన్ సెంటర్ ద్వారా నగరంలోని 83 జంక్షన్లలో ఏర్పాటు చేసిన 500 సీసీ కెమెరాలు, 84 పబ్లిక్ అడ్రసింగ్ సిస్టమ్స్, 50 స్మార్ట్‌పోల్స్, 85 అత్యవసర కాల్ బాక్స్‌లు, 10 వీఎండీ బోర్డుల ద్వారా సేవలు కల్పించడం జరుగుతుందని ఎస్ఈ కమిషనర్‌కు వివరించారు. 24 గంటలు కార్యకలాపాలు పర్యవేక్షిస్తారని తెలిపారు. అనంతరం కమిషనర్ అక్కడి ఉద్యోగుల వివరాలు, విధులతో పాటు రోజూ ప్రజల నుంచి ఎన్ని ఫిర్యాదులు వస్తున్నాయి, వాటి పరిష్కారంపై ప్రజల అభిప్రాయాలు, ప్రకృతి వైపరీత్యాలు సంభవించినప్పుడు ప్రజలకు అందిస్తున్న సమాచార వివరాలు, పలు జంక్షన్లలో సీసీ కెమెరాల పనితీరుపై ఆరా తీశారు. ఫ్లుయింటిగ్రిడ్ ప్రాజెక్టు మేనేజర్ శ్రీనివాస్, ఆపరేషన్స్ మేనేజర్ సమీరా ఆ వివరాలను కమిషనర్‌కు తెలియజేశారు. వాటిని సీవోసీ స్క్రీన్‌పై కమిషనర్ తిలకించారు. ప్రజలతో గౌరవంగా మెలగాలని, సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని సీవోసీ సిబ్బందికి కమిషనర్ సూచించారు. సీవోసీ ద్వారా అన్ని సర్వీసులు పూర్తి స్థాయిలో నిర్వహణ జరిగేలా చూడాలని పర్యవేక్షక ఇంజినీర్‌ను ఆదేశించారు. వచ్చే సందర్శనలో అన్ని సర్వీసులు మరోసారి సమీక్షిస్తానని కమిషనర్ తెలిపారు. జీవీఎంసీ కార్యనిర్వాహక ఇంజినీరు సుబ్బారావు, స్మార్ట్‌సిటీ మేనేజర్ ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

త్వరితగతిన నిర్మాణాలు పూర్తి



అధికారులకు సూచనలిస్తున్న మెట్రోపాలిటన్ కమిషనర్ కె.ఎస్.విశ్వనాథన్

విశాఖ సిటీ: మల్టీ లెవెల్ కార్ పార్కింగ్, కమర్షియల్ కాంప్లెక్స్ నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని మెట్రోపాలిటన్ కమిషనర్ కె.ఎస్. విశ్వనాథన్ అధికారులను ఆదేశించారు. మల్టీ లెవెల్ కార్ పార్కింగ్ నిర్మాణ పనుల పురోగతిని గురువారం ఆయన పరిశీలించారు. సాధ్యమైనంత వేగంగా నిర్మాణాలను పూర్తి చేసి కాంప్లెక్స్‌ను అందుబాటులోకి తీసుకురావాలని చెప్పారు. ఈ పర్యటనలో జాయింట్ కమిషనర్ రవీంద్ర, కార్యదర్శి కీర్తి, ప్రధాన ఇంజినీర్ భవానీశంకర్, పర్యవేక్షక ఇంజినీర్ బలరామరాజు, కార్యనిర్వాహక ఇంజినీర్ రామరాజు, కాంట్రాక్టర్ ప్రతినిధి కృష్ణమోహన్, ఏపీయూఐఏఎంఎల్ ప్రతినిధులు పాల్గొన్నారు. అనంతరం కమిషనర్ వీఎంఆర్‌డీఏ సమావేశ మందిరంలో వీకేపీసీపీఐఆర్ సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. ప్రస్తుత పరిస్థితులు, ఇప్పటికే చేపట్టిన కార్యకలాపాలపై ఆరా తీశారు. సమావేశంలో జాయింట్ డైరెక్టర్ శిల్ప, ప్రణాళికాధికారులు సత్యనారాయణమూర్తి, చైతన్య పాల్గొన్నారు.

ప్రతిభా పురస్కారాలకు దరఖాస్తుల ఆహ్వానం

ఎంవీపీ కాలనీ: పదో తరగతి, ఇంటర్మీడియట్‌లో ప్రతిభకనబరిచిన గిరిజన విద్యార్థులకు పురస్కారాలు అందజేయనున్నట్లు అఖిల భారత గిరిజన ఉద్యోగుల సంక్షేమ సంఘం సభ్యులు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్హులైన విద్యార్థులు తమ ధ్రువ పత్రాలను వచ్చే నెల 5వ తేదీలోగా ఎంవీపీ కాలనీ సెక్టార్–5లో ఉన్న గిరిజన భవన్ కార్యాలయంలో అందజేయాలని పేర్కొన్నారు. ఆయా తరగతుల్లో మార్కుల మెరిట్ ఆధారంగా తొలి ముగ్గురు విద్యార్థులకు పురస్కారాలు అందజేయనున్నామన్నారు.

'ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజుది అహంకారం'

విశాఖ సిటీ: విశాఖ ఉత్తర ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజు మర్యాద నేర్చుకుని మాట్లాడాలని హోమియోపతి వైద్యుడు డాక్టర్ మహమ్మద్ రియాజ్ అహ్మద్ ఓ ప్రకటనలో సూచించారు. వైఎస్సార్ సీపీకి ఓటు వేసిన వారు అన్నం తింటున్నారా? లేక మరేదైనానా? అని వ్యాఖ్యానించడం ఆయన అహంకారానికి నిదర్శనమని, ఇది సరైన పద్ధతి కాదని హితవుపలికారు. దేవుడు ప్రసాదించిన అన్నమే తింటున్నామని, ఇలా వ్యాఖ్యానించిన ఎమ్మెల్యే ఏం తింటున్నారో ఆయనకే తెలియాలని ఎద్దేవా చేశారు. అహంకారంతో 40 శాతం రాష్ట్ర ప్రజలపై వ్యంగ్యంగా చేసిన వ్యాఖ్యలను వెంటనే వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు.

కేంద్ర బడ్జెట్‌లో ఉత్తరాంధ్రకు ద్రోహం

- మద్దిలపాలెంలో సీపీఎం నిరసన


మద్దిలపాలెం కూడలిలో నిరసన తెలియజేస్తున్న సీపీఎం నాయకులు

మద్దిలపాలెం : కేంద్ర ప్రభుత్వం ఇటీవల ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికే కాదు ఉత్తరాంధ్రకు కూడా తీవ్ర ద్రోహం చేసిందని సీపీఎం విశాఖ జిల్లా కార్యవర్గ సభ్యుడు బి.గంగారావు దుయ్యబట్టారు. ప్రజా వ్యతిరేక కేంద్ర బడ్జెట్‌పై మద్దిలపాలెం కూడలిలో గురువారం నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్‌డీఏ ప్రభుత్వం రాష్ట్రానికి 11 ఏళ్లుగా ద్రోహం చేస్తూ వస్తుందన్నారు. దీనిపై రాష్ట్రంలో ప్రధాన రాజకీయ పార్టీలు నోరుమెదపడంలేదన్నారు. విశాఖ స్టీల్ ప్లాంట్‌ను సెయిల్‌లో కలుపుతామని ప్రకటన చేయకపోగా.. ప్లాంట్‌కు అవసరమైన వర్కింగ్ క్యాపిటల్ రూ.5 వేల కోట్ల నిధులు కేటాయించలేదని విమర్శించారు. వెనకబడిన ఉత్తరాంధ్ర, రాయలసీమకు చెందిన ఏడు జిల్లాలకు ప్రత్యేక ప్యాకేజీ కింద నిధులు కేటాయింపులు లేవన్నారు. విశాఖ రైల్వేజోన్ ఊసేలేదని, ఇక విశాఖ, విజయవాడ మెట్రో రైలు, కడప ఉక్కు ఫ్యాక్టరీ, దుగ్గిరాజు పట్టణం పోర్టు వంటి వాటికి గుండుసున్నా చుట్టారని ఎద్దేవా చేశారు. తక్షణమే ఈ బడ్జెట్‌లో రాష్ట్రానికి నిధులు కేటాయించేలా తగిన సవరణలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. దీనిపై ఎన్‌డీఏ కూటమిలో ఉన్న టీడీపీ, జనసేన ఎంపీలు ఒత్తిడి తీసుకురావాలన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు పి.మణి, జోన్ కమిటీ సభ్యులు పి.వెంకటరావు, కె.కుమారి, నాయకులు కె.ఎం.కుమారమంగళం, అనపర్తి అప్పారావు, జె.ఆర్.నాయుడు, వెంకటరావు, వైకుంఠరావు, తులసీరాం, విజయ, నాగేశ్వరరావు, త్రినాథం, తదితరులు పాల్గొన్నారు.

మహిళ ఆత్మహత్యాయత్నం

- రక్షించిన పోలీసులు


బాధితురాలితో మాట్లాడుతున్న పోలీసులు

బీచ్ రోడ్డు: మానసిక సమస్యలతో ఆత్మహత్య చేసుకోవడానికి ప్రయత్నించిన ఓ మహిళను మూడో పట్టణ పోలీసులు కాపాడారు. వివరాలిలా ఉన్నాయి. అక్కయ్యపాలెంలో నివాసం ఉంటున్న ఓ మహిళ మానసిక రుగ్మత కారణంగా ఆత్మహత్య చేసుకోవడానికి గురువారం సాయంత్రం ఆర్కే బీచ్‌కు చేరుకుంది. సముద్రం లోపలికి వెళ్తున్న ఆమెను గమనించిన సందర్శకులు వెంటనే బీచ్ పోలీసులకు సమాచారం అందించారు. స్థానికుల సహకారంతో పోలీసులు ఆమె ప్రయత్నాన్ని అడ్డుకుని రక్షించారు. బాధితురాలికి కౌన్సెలింగ్ ఇచ్చారు. తక్షణమే స్పందించి మహిళను కాపాడిన పోలీసు సిబ్బందిని నగర పోలీసు కమిషనర్ శంఖబ్రత బాగ్చి అభినందించారు.

కార్గిల్ అమరులకు ఘన నివాళి

బీచ్‌రోడ్డు: విజయ దివస్ పురస్కరించుకుని బీజేపీ యువ మోర్చా నాయకులు కార్గిల్ యుద్ధ వీరులకు ఘన నివాళులర్పించారు. బీచ్‌రోడ్డు విక్టరీ ఎట్ సీలోని అమరవీరుల స్థూపం వద్ద గురువారం ఈ కార్యక్రమం జరిగింది. నాయకులు జాతీయ జెండాలు, కాగడాలతో కార్గిల్ యుద్ధంలో అమరులైన వారికి అంజలి ఘటించారు. సైనికుల ధైర్య సాహసాలు గుర్తు చేసుకుని.. అమరులకు జాతి సలాం చేస్తోందని పేర్కొన్నారు.

‘నవోదయ’ పిలుస్తోంది

- 6వ తరగతిలో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం
- సెప్టెంబర్ 16 చివరి తేదీ
- వచ్చే జనవరి 18న ప్రవేశ పరీక్ష


కొమ్మాదిలోని నవోదయ ప్రాంగణం

కొమ్మాది: కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా ఆంగ్ల మాధ్యమ విద్యనందిస్తున్న ప్రభుత్వ రంగ విద్యా సంస్థ జవహర్ నవోదయ విద్యాలయం. ఇక్కడ చదువుతోపాటు ఐఐటీ ప్రవేశ పరీక్షకు శిక్షణ, వ్యక్తిత్వ వికాసం, క్రీడలు తదితర అంశాల్లో ప్రోత్సహిస్తున్నారు. ఈ విద్యాలయంలో చదివే ప్రతి ఒక్కరికీ బంగారు భవిష్యత్ ఉంటుందని తల్లిదండ్రుల నమ్మకం. దీంతో ఈ విద్యాలయంలో ప్రవేశం పొందేందుకు తీవ్ర పోటీ నెలకొంది. పక్కా ప్రణాళిక, కఠోరమైన సాధన చేస్తే తప్ప ఈ విద్యాలయంలో 6వ తరగతిలో సీటు సాధించలేం. ఇక్కడ విద్యాభ్యాసం ఎలా ఉంటుంది, దైనందిక కార్యక్రమాలు, వసతి, భోజన సౌకర్యాలు తదితర అంశాలపై ఓ లుక్ వేద్దాం.

కొమ్మాది నవోదయ విద్యాలయం.. 6వ తరగతి నుంచి 12వ తరగతి వరకు కేంద్ర ప్రభుత్వ నిధులతో విద్యనందిస్తున్న సంస్థ. ఈ పాఠశాలలో చేరేందుకు ప్రభుత్వ పాఠశాల లేదా ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలలో మూడు, నాలుగో తరగతి చదివి.. ప్రస్తుతం ఐదవ తరగతి చదువుతున్న విద్యార్థులు అర్హులు. 80 సీట్లలో రూరల్ ప్రాంతాల విద్యార్థులకు 75 శాతం, పట్టణ ప్రాంత విద్యార్థులకు 25 శాతం కేటాయిస్తారు. ఈ స్కూలులో చేరేందుకు 100 మార్కులతో కూడిన ప్రవేశ పరీక్ష ఉంటుంది. మేధాశక్తి పరీక్షకు 50 మార్కులు, గణిత పరీక్షకు 25 మార్కులు, భాషా పరీక్షకు 25 మార్కులు ఉంటాయి.

అందుబాటులో అన్ని సౌకర్యాలు

విద్యార్థులు తమ అవసరాల కోసం బయటకు వెళ్లనవసరం లేదు. అన్నీ విద్యాలయంలోనే అందుబాటులో ఉంటాయి. విద్యార్థులు అనారోగ్యానికి గురైనా ప్రాంగణంలోనే ప్రత్యేక మెడికల్ రూమ్‌లో స్టాఫ్ నర్స్ ద్వారా ప్రాథమిక చికిత్సను అందిస్తారు. మరింత మెరుగైన చికిత్స అవసరమైతే నగరంలోని ఆస్పత్రుల్లో వైద్యసేవలందిస్తారు. విద్యార్థులకు దుస్తులు, షూ, రెండు జతల స్పోర్ట్స్ దుస్తులు, బెడ్ షీట్, టవల్, పుస్తక సామగ్రితో పాటు విద్యార్థికి కావాల్సిన అన్ని వసతులు ఉచితమే.

అత్యుత్తమ విద్యాబోధన

గ్రామీణ ప్రాంతాల్లో నివసించే ప్రతిభావంతులైన విద్యార్థులకు అధిక ప్రాధాన్యం ఇస్తూ.. సాంకేతిక విద్యను అందిస్తారు. శాంసంగ్ సౌజన్యంతో 41 ల్యాప్‌టాప్‌లు ఏర్పాటు చేసి.. ప్లాస్మా టీవీ, హైస్పీడ్ ఇంటర్నెట్ సౌకర్యంతో డిజిటల్ విధానంలో బోధిస్తున్నారు. ఉత్తమ సంస్కృతి విలువలను పెంపొందించడం, పర్యావరణంపై అవగాహన, క్రీడలు, వ్యాయామ విద్యలో శిక్షణ, హిందీ, ఆంగ్లం, తెలుగు భాషల్లో తగిన నైపుణ్యాలను పెంపొందించడం, వలస విద్య (మైగ్రేషన్) విధానం ద్వారా హిందీ రాష్ట్ర విద్యార్థులను హిందీయేతర రాష్ట్రాలకు పంపించి జాతీయ సమైక్యత భావాన్ని పెంపొందించడం, వ్యాసరచన, వక్తృత్వ, క్విజ్, గీతాలాపన, చిత్రలేఖనం, సాంఘిక నాటకాల ప్రదర్శన తదితర అంశాల్లో ప్రత్యేక శిక్షణ, వివిధ క్రీడల్లో పోటీల నిర్వహణ, వారంలో ఓ రోజు విద్యార్థులకు ఇంటర్ హౌస్ పోటీల నిర్వహణ , బాలికల స్వీయరక్షణకు మార్షల్ ఆర్ట్స్‌లో శిక్షణ, శాస్త్రీయ, జానపద నృత్యాలపై అభిలాష ఉన్న వారికి ప్రత్యేక శిక్షణ ఉంటుంది. 10 వేల పుస్తకాలతో ఏర్పాటు చేసిన అధునాతన గ్రంథాలయం అందుబాటులో ఉంది.

వసతి సౌకర్యం ఇలా..

తరగతి గదిలో బాలురు, బాలికలు కలసి చదువుకుంటారు. వసతి, భోజనశాలలు వేర్వేరుగా ఉంటాయి. ఉపాధ్యాయులే అదనపు బాధ్యత తీసుకుని వార్డెన్‌గా వ్యవహరిస్తారు. 16 మంది ఉపాధ్యాయ బృందంలో రోజుకు 8 మంది చొప్పున పనిచేస్తూ వారి యోగక్షేమాలు పర్యవేక్షిస్తారు.

జనవరిలో ప్రవేశ పరీక్ష

జవహర్ నవోదయ విద్యాలయంలో 2025–26లో 6వ తరగతి ప్రవేశం కోసం నిర్వహించే ప్రవేశ పరీక్షకు అభ్యర్థుల నుంచి దరఖాస్తుల ఆహ్వానిస్తున్నారు. ప్రస్తుతం జిల్లాలోని ఏదైనా ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలలో 5వ తరగతి చదువున్న విద్యార్థులు దరఖాస్తు చేసుకోవచ్చు. విద్యార్థులు 2013 మే1 నుంచి 2015 జూలై 31 మధ్య జన్మించిన వారై ఉండాలి. https:// navodaya. gov. in/ nvs/en/ Home1 వెబ్‌సైట్‌ను సందర్శించి.. ఆన్‌లైన్‌లో సెప్టెంబర్ 16వ తేదీ లోపు దరఖాస్తు చేసుకోవాలి. 2025 జనవరి 18వ తేదీన ప్రవేశ పరీక్ష ఉంటుంది.


వాలీబాల్‌లో శిక్షణ పొందుతున్న విద్యార్థులు

కోణార్క్ ఎక్స్‌ప్రెస్‌కు త్వరలో రెండు జనరల్ కోచ్‌లు

తాటిచెట్లపాలెం: భువనేశ్వర్ – ఛత్రపతి శివాజీ టెర్మినస్ ముంబయి మధ్య నడుస్తున్న కోణార్క్ ఎక్స్‌ప్రెస్‌కు నవంబర్ నుంచి మరో రెండు జనరల్ కోచ్‌లను అదనంగా జత చేయనున్నట్లు వాల్తేర్ డివిజన్ సీనియర్ డీసీఎం కె.సందీప్ తెలిపారు. సాధారణ ప్రయాణికులకు మరింత సౌకర్యవంతమైన ప్రయాణాన్ని కల్పించేందుకు ఈ కోచ్‌లను పెంచుతున్నట్లు తెలిపారు. భువనేశ్వర్–ఛత్రపతి శివాజీ టెర్మినస్ ముంబయి (11020) కోణార్క్ ఎక్స్‌ప్రెస్‌కు నవంబరు 17 నుంచి, ఛత్రపతి శివాజీ టెర్మినస్ ముంబయి–భువనేశ్వర్ (11019) కోణార్క్ ఎక్స్‌ప్రెస్‌కు నవంబరు 15 నుంచి ఈ కోచ్‌లను శాశ్వత ప్రాతిపదికన జత చేస్తున్నట్లు వివరించారు.

విశాఖలో ‘అలనాటి రామచంద్రుడు’ సందడి


మాట్లాడుతున్న హీరో కృష్ణ వంశీ, హీరోయిన్ మోక్ష

డాబాగార్డెన్స్: విశాఖలో అలనాటి రామచంద్రుడు చిత్ర యూనిట్ గురువారం సందడి చేసింది. కృష్ణ వంశీ, మోక్ష హీరో హీరోయిన్లుగా హైనివా క్రియేషన్స్ బ్యానర్‌పై హైమావతి, శ్రీరామ్ జడపోలు నిర్మించగా, చిలుకూరి ఆకాష్‌రెడ్డి దర్శకత్వం వహించిన ఈ చిత్రం ఆగస్టు 2న విడుదల కానుంది. ప్రమోషన్లో భాగంగా నటులు స్నేహ, వెంకటేష్‌తో కలిసి యూనిట్ సభ్యులు నగరంలోని ఓ హోటల్లో మీడియా సమావేశంలో మాట్లాడారు. హీరో కృష్ణ వంశీ మాట్లాడుతూ శశాంక్ తిరుపతి మంచి సంగీతం అందించారన్నారు. తనకు విశాఖతో ప్రత్యేక అనుబంధం ఉందని, స్టార్‌మేకర్ సత్యానంద్ వద్ద శిక్షణ తీసుకున్నానని, ఇదే తనకు తొలి సినిమా అని చెప్పారు. అందరికీ తొలిప్రేమ ఉంటుందని, అమ్మాయిలు సాధారణంగా తండ్రి లాంటి భర్తనే కోరుకుంటారని, ఇందులో తాను సిద్ధూ పాత్ర చేశానని తెలిపారు. హీరోయిన్ మోక్ష మాట్లాడుతూ తాను కూడా చిన్నతనంలో విశాఖలోనే పెరిగానన్నారు. డైరెక్టర్ చిలుకూరి మాట్లాడుతూ ఈ సినిమా హిట్ కావాలని సింహాద్రినాథుడిని దర్శనం చేసుకున్నామని, ఈ రాముడు సీతతో అబద్ధం ఆడితే ఎలా ఉంటుందన్న అంశంతో సినిమా ఉంటుందని చెప్పారు. హాస్యనటుడు వెంకటేష్, నటి స్నేహ మాట్లాడుతూ విశాఖ రావడం సంతోషంగా ఉందన్నారు.

పోక్సో కేసు నమోదుతో ఆత్మహత్యాయత్నం

- కేజీహెచ్‌లో చికిత్స పొందుతూ యువకుడి మృతి

మద్దిలపాలెం: పోక్సో కేసు నమోదుతో మనస్తాపం చెంది ఆత్మహత్యాయత్నం చేసిన యువకుడు.. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. మైనర్లయిన అక్కాచెల్లెళ్లను వేధింపులకు గురి చేసిన కంచరపాలెం వాడపేటకు చెందిన రోహిత్ రెడ్డిపై ఐదో పట్టణ పోలీస్ స్టేషన్‌లో పోక్సో కేసు నమోదైన విషయం తెలిసిందే. అదే ప్రాంతానికి చెందిన అక్కాచెల్లెళ్లను నిత్యం వేధింపులకు గురిచేస్తుండడంతో వారి తల్లి పుష్పలత ఈ నెల 22న పోలీసులకు ఫిర్యాదు చేశారు. విచారణ జరిపిన పోలీసులు ఆ యువకుడిపై పోక్సో కేసు నమోదు చేశారు. దీంతో మనస్తాపానికి గురైన రోహిత్ అదే రోజు అర్ధరాత్రి తన ద్విచక్రవాహనంపై తిమ్మాపురం చేరుకున్నాడు. తన బైకులోని పెట్రోల్‌ను బాటిల్‌లోకి నింపి.. ఒంటిపై పోసుకుని నిప్పంటించుకున్నాడు. ఇది గమనించిన స్థానికులు భీమిలి పోలీసులకు సమాచారం అందించారు. తర్వాత పోలీసులు అతన్ని కేజీహెచ్‌కు తరలించారు. కేజీహెచ్‌లో రోహిత్ చికిత్స పొందుతూ గురువారం సాయంత్రం మృతి చెందాడు.

జర్నలిస్టుల ఇళ్ల స్థలాల ప్రక్రియ వేగవంతం చేయండి

- కలెక్టర్‌ను కోరిన అక్రిడిటేటెడ్ జర్నలిస్ట్ హౌసింగ్ సొసైటీ ప్రతినిధులు

ఎంవీపీకాలనీ: జర్నలిస్టుల ఇళ్ల స్థలాలు మంజూరు ప్రక్రియను వేగవంతం చేయాలని విశాఖ అక్రిడిటేటెడ్ జర్నలిస్ట్ హౌసింగ్ సొసైటీ కలెక్టర్ హరేందిర ప్రసాద్‌ను కోరింది. ఈ మేరకు సొసైటీ ప్రతినిధులు కలెక్టర్ కార్యాలయంలో గురువారం ఆయన్ని కలిసి వినతిపత్రం అందజేశారు. ఇటీవల జిల్లా కలెక్టర్‌గా నియమితులైన ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఇళ్ల స్థలాల మంజూరుకు సంబంధించి కొంతకాలంగా జరిగిన పరిణామాలను కలెక్టర్‌కు వివరించారు. సొసైటీలో సుమారు 800 మంది సభ్యులు ఉన్నారన్నారు. విశాఖలో గత 20 ఏళ్లుగా జర్నలిస్టులకు ఎలాంటి ఇళ్ల స్థలాలు కేటాయింపులు జరగలేదన్నారు. ఈ నేపథ్యంలో గత ప్రభుత్వంలో ఇళ్ల స్థలాలకు దరఖాస్తు చేసుకున్న జర్నలిస్టులకు కేటాయింపులు జరిగేలా కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో సొసైటీ గౌరవ అధ్యక్షుడు జి.జనార్దనరావు, అధ్యక్షుడు బి.రవికాంత్, పలువురు సొసైటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

క్షణికావేశంలో తప్పిదాలు

- అదుపు తప్పితే జైలుపాలు
- న్యాయమూర్తి రమేష్


ఖైదీలతో మాట్లాడుతున్న న్యాయమూర్తి రమేష్

అనకాపల్లి: క్షణికావేశంలో చేసిన తప్పిదాల వల్ల కొంతమంది వ్యక్తులు జైలు పాలవుతున్నారని మొదటి అదనపు జూనియర్ సివిల్, 11వ మెట్రోపాలిటన్ న్యాయమూర్తి ఎ.రమేష్ అన్నారు. స్థానిక సబ్‌జైల్లో మండల న్యాయసేవాధికార సంఘం ఆధ్వర్యంలో పాన్‌ఇండియా కార్యక్రమంలో భాగంగా జైల్లో బాల నేరస్తుల గుర్తింపు కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. అనకాపల్లి సబ్ జైల్లో బాలలెవరూ లేరని గుర్తించారు. ఈ సందర్భంగా న్యాయమూర్తి మాట్లాడుతూ ఖైదీలకు ప్రభుత్వం ఉచితంగా న్యాయ సహాయం చేస్తుందని పేర్కొన్నారు. ఖైదీల సమస్యలు కోర్టు దృష్టికి తీసుకువస్తే పరిష్కార మార్గం చూపుతామన్నారు. ఈ కార్యక్రమంలో సబ్ జైలు సూపరింటెండెంట్ గణేష్‌రెడ్డి, న్యాయ సహాయకులు సాయిరామ్, రోజా, తులసి తదితరులు పాల్గొన్నారు.

తాటిగుడ ఉరకలు


అనంతగిరి : ఏజెన్సీ వ్యాప్తంగా కురుస్తున్న వర్షాలకు జలపాతాలు ఉరకలేస్తున్నాయి. మరోవైపు ఎటువంటి ప్రమాదం జరగకుండా ఉండేందుకు మండలంలోని తాటిగుడ జలపాతం వద్దకు పర్యాటకులను అనుమతించకుండా ఆంక్షలు విధించారు.

రెండు శాఖల పనితీరుపై కలెక్టర్ సమీక్ష


పర్యాటక, గృహనిర్మాణాలపై సమీక్షిస్తున్న కలెక్టర్ ఎం.ఎన్.హరేందిర ప్రసాద్

మహారాణిపేట: జిల్లాలో పర్యాటక, గృహ నిర్మాణ సంస్థ పనితీరుపై జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరేందిర ప్రసాద్ సమీక్షించారు. ఆయా శాఖలు చేపట్టిన ప్రగతి, చేపట్టనున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలపై సంబంధిత అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ పలు సూచనలు చేశారు.

సార్ట్‌ను సందర్శించిన జీఎం విద్యారామన్ ఝా


మొక్కలు నాటుతున్న విద్యారామన్ ఝా

ఎంవీపీకాలనీ: విశాఖలోని స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా సార్స్ (స్ట్రెస్డ్ అసెట్స్ రికవరీ బ్రాంచ్)ను హైదరాబాద్ సామ్రో (స్ట్రెస్డ్ అసెట్స్ మేనేజ్‌మెంట్ రీజనల్ ఆఫీస్) జనరల్ మేనేజర్ విద్యారామన్ ఝా సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2024-25 ఏడాదికి గాను తొలి క్వార్టర్‌లో అత్యధిక రికవరీలు సాధించిన బ్రాంచ్‌గా విశాఖలోని సార్స్ నిలిచిందన్నారు. భవిష్యత్ లక్ష్యాలు, రికవరీలో పాటించిన విధి విధానాలపై సిబ్బందికి అవగాహన కల్పించారు. అనంతరం బ్రాంచ్ ప్రాంగణంలో మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో విశాఖ సార్స్ ఏజీఎం ఎం.విజయలక్ష్మి, చీఫ్ మేనేజర్లు బి.వరప్రసాద్, ఇ.లాలు, వై.శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

విశాఖ బులియన్

24 క్యారెట్స్(10 గ్రా.)	రూ.64,000
22 క్యారెట్స్(10 గ్రా.)	రూ.69,820
వెండి(కిలో):	రూ.89,000

రాజభాష సమ్మాన్ అవార్డుల ప్రదానం


హిందీ మ్యాగజైన్‌ను విడుదల చేస్తున్న టాలిక్ ప్రతినిధులు

ఉక్కునగరం: హిందీ భాష అమలుకు కృషి చేసిన వివిధ సంస్థలకు, సమన్వయకర్తలకు రాజభాష సమ్మాన్ అవార్డులు ప్రదానం చేశారు. ఎన్‌టీపీసీ ఆధ్వర్యంలో టౌన్ అధికార భాష అమలు కమిటీ (టాలిక్) సమావేశాన్ని విశాఖలో గురువారం నిర్వహించారు. టాలిక్ చైర్మన్, స్టీల్‌ప్లాంట్ సీఎండీ అతుల్ భట్ అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో 2023-24 సంవత్సరానికి గాను కేటగిరీ-1లో హెచ్‌పీసీఎల్ విశాఖ రిఫైనరీ, ఎన్‌టీపీసీ సింహాద్రి, ఎయిర్ పోర్ట్ అథారిటీలకు వరుసగా మూడు బహుమతులు ప్రదానం చేశారు. కేటగిరీ-2లో గెయిల్, హెచ్‌పీసీఎల్ విశాఖ ప్రాంతీయ కార్యాలయం, సెయిల్ షిప్పింగ్, ఎఫ్‌సీఐ ప్రాంతీయ కార్యాలయాలు వరుసగా బహుమతులు అందుకున్నాయి. కేటగిరీ-3లో ఎస్.ఎస్.టి.సి, హెచ్‌పీసీఎల్ ఎల్‌పీజీ, ఈసీజీసీ వరుస మూడు బహుమతులు గెలుపొందాయి. ఈ సందర్భంగా చైర్మన్ అతుల్ భట్ మాట్లాడుతూ రాజభాష హిందీ అమలుకు కృషి చేస్తున్న సంస్థలను అభినందించారు. ఈ సందర్భంగా టాలిక్ హిందీ 8వ మ్యాగజైన్ ‘విశాఖ ధార’ను అహూతులు ఆవిష్కరించారు. కార్యక్రమంలో స్టీల్ ప్లాంట్ హెచ్‌ఆర్ సీజీఎం జి.గాంధీ, రాజభాష జీఎం లలన్‌కుమార్, హోం మంత్రిత్వ శాఖ హిందీ టీచింగ్ స్కీమ్ అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ రీటా త్రివేది, ఎన్‌టీపీసీ సింహాద్రి ప్రాజెక్ట్ హెడ్ సంజయ్ కుమార్ సిన్హా, వివిధ సంస్థల అధిపతులు పాల్గొన్నారు.


పోర్టుల ప్రైవేటీకరణ వద్దు


పోర్టు ప్రధాన ద్వారం వద్ద ధర్నా చేస్తున్న పోర్టు ఉద్యోగులు

జగదాంబ: పోర్టుల ప్రైవేటీకరణ ఆపాలని డిమాండ్ చేస్తూ ఉద్యోగులు పోర్టు ప్రధాన ద్వారం వద్ద నిరాహార దీక్షలు చేపట్టారు. స్టీల్‌ప్లాంట్ పరిరక్షణ కమిటీ చైర్మన్, సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి జగ్గునాయుడు, ఆర్.కె.ఎస్.వి కుమార్, పోర్టు యూనియన్ గౌరవ అధ్యక్షుడు వి.ఎస్.పద్మనాభరాజు ఆధ్వర్యంలో దీక్షలు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత సంవత్సరం విశాఖపట్నం పోర్టు 385 కోట్లు లాభాల్లో ఉందన్నారు. కానీ కేంద్రప్రభుత్వం మేజర్ పోర్టులను ల్యాండ్‌లార్డ్ పోర్టులుగా మార్చుతోందని, అందులో విశాఖపట్నం కూడా ఉందని అన్నారు. ప్రభుత్వ సెక్టార్లను పూర్తిగా ప్రైవేటీకరణ చేసి పెట్టుబడిదారులకు అప్పగించడానికి కేంద్ర ప్రభుత్వం కుట్ర పన్నుతోందన్నారు. కార్మికులకు షరతుల్లేని వేతన ఒప్పందం చేయాలని, పెండింగ్ బోనస్ చెల్లించాలని, ఫూల్ కలాశీల పోస్టులను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వాటర్ ట్రాన్స్‌ఫర్ వర్కర్స్ ఫెడరేషన్ ఆల్ ఇండియా కార్యదర్శి జగన్, యూనియన్ అధ్యక్షుడు సాంబమూర్తి, సత్యనారాయణ, జక్కాన సత్యనారాయణ, లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ హిత అభివృద్ధి శ్రేయస్కరం

- వాటర్ మేన్ ఆఫ్ ఇండియా డాక్టర్ రాజేంద్రసింగ్


మాట్లాడుతున్న వాటర్ మేన్ డాక్టర్ రాజేంద్ర సింగ్

సీతంపేట: పర్యావరణ హిత అభివృద్ధి సమాజానికి అవసరమని వాటర్ మేన్ ఆఫ్ ఇండియా డాక్టర్ రాజేంద్రసింగ్ అన్నారు. ‘వారసత్వ సంపద పరిరక్షణ’ అనే అంశంపై ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో గురువారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. విశాఖలోని సహజ సిద్ధ అందాలు, ప్రకృతి మూడు దశాబ్దాలుగా విధ్వంసానికి గురవుతోందన్నారు. ముడసర్లోవ నీటి కాలుష్యం నివారణకు డంపింగ్ యార్డును తరలించాలన్నారు. అక్కడ నిర్మిస్తున్న గుర్రాల పార్కు నిర్మాణాన్ని నిలిపివేయాలని డిమాండ్ చేశారు. వారసత్వ సంపదను పరిరక్షించుకోవాలని, టూరిజం, తీర్థయాత్రలను వేర్వేరుగా చూడాలన్నారు. సహజంగా ఏర్పడిన ఎర్రమట్టి దిబ్బలను పరిరక్షించుకోకపోతే భావితరాలు క్షమించవని హెచ్చరించారు. వారసత్వ సంపద పరిరక్షణలో యూనివర్సిటీలను భాగస్వామ్యం చేయాలన్నారు. ప్రభుత్వాలు అభివృద్ధి పేరిట విధ్వంసం సృష్టిస్తున్నాయని, పర్యావణాన్ని పరిరక్షిస్తూ అభివృద్ధి చేపట్టాలని కోరారు. నీటికి, నదికి, మహిళలకు గౌరవం ఇచ్చినప్పుడే మళ్లీ భారతదేశానికి జగద్గురు ఖ్యాతి లభిస్తుందన్నారు. జల బిరాదరి నేషనల్ కన్వీనర్ బొలిశెట్టి సత్యనారాయణ మాట్లాడుతూ పర్యావరణం బాగుంటేనే మానవ మనుగడ సాధ్యమన్నారు. వందేళ్ల పైబడిన కట్టడం, చెట్టు, చెరువు ఏదైనా వారసత్వ సంపదగా చూడాలని కోరారు. చిల్లపేట చెరువుకు ఒకప్పుడు 107కి పైగా విదేశీ పక్షులు వచ్చేవని, కాలుష్యం కారణంగా ఇప్పుడు ఒక్క పక్షి కూడా రావడం లేదన్నారు. పర్యావరణవేత్త రాజశర్మ మాట్లాడుతూ శ్రీకాకుళం నుంచి అమరావతి వరకు ఉన్న బౌద్ధ ఆరామాలను పరిరక్షించాలన్నారు. ఈ సమావేశంలో గ్రీన్ క్లైమేట్ వ్యవస్థాపకుడు జె.వి.రత్నం, జియాలజిస్ట్ రాజశేఖర్‌రెడ్డి, కార్పొరేటర్ పీతల మూర్తియాదవ్, జనసేన నాయకుడు శంకు వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.